క్లుప్తంగా

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



కుండీలో మొక్క నాటుతున్న అసిస్టెంట్ మేనేజర్ నాగరాజు

ఎమ్మిగనూరుటౌన్: మొక్కలు నాటి వాటిని పరిరక్షించుకుంటే కాలుష్యాన్ని నివారించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని స్థానిక ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ జీవీ నాగరాజు అన్నారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో కుండిల్లో మొక్కలు నాటడంతో పాటు డిపో ఆవరణలో సిబ్బందితో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో ప్రహరి పక్కన మొక్కలు నాటుతామని చెప్పారు. సిబ్బంది వాటిని పరిరక్షించి కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. కార్యక్రమంలో డిపో ఎన్ఎంయూఏ కార్యదర్శి ముస్తాక్ అహమ్మద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కోసిగి: సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు తక్షణమే చెల్లించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 30వ తేదీ వరకు సంక్షేమ హాస్టళ్లను సందర్శించి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకుంటామన్నారు. ఈ సమస్యలపై ఆగస్టు 6న శాంతియుత ధర్నాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అందించవలసిన దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు, దోమ తెరలు, ఇవ్వలేదని, 9నెలలుగా మెస్ చార్జీలు రాలేదని విద్యార్థులు తెలిపారన్నారు. హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కరువైయ్యాయన్నారు. నాయకులు నవనీత్, రాము, రాజు, ప్రసాద్, హనుమంతు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలి

ఆలూరు: 2022–23లో ఖరీఫ్, రబీలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు బీమా పరిహారం మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో నియోజకవర్గ రైతు సంఘం నాయకులతో జనరల్ బాడీ సమావేశం మండలం అధ్యక్షుడు చంద్రకాంత్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందుకు జగన్నాథం, జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు, జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి తిమ్మయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జగన్నాథం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సన్న, చిన్నకారు రైతుల ఇబ్బందులపై దృష్టి సారించడంలేదన్నారు. రైతు శ్రేయస్సు కోసం ఈనెల 28,29, 30వ తేదీల్లో మనపల్లిలో నిర్వహిచనున్న రైతు సమ్మేళనం సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు భూపేష్,ఆలూరు, హొళగుంద మండల సీపీఐ కార్యాదర్శులు రామాంజనేయులు,రంగన్న, జిల్లా నాయకులు రంగన్న,గోపాల్ పాల్గొన్నారు.

విత్తన విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



ఇన్‌పుట్ డీలర్లు తయారు చేసిన రిజిస్టర్లను ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): చట్టాలకు లోబడి ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు విక్రయించాలని విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమా కోర్సు సమన్వయకర్త జయచంద్ర ఇన్‌పుట్ డీలర్లకు సూచించారు. ఆదివారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సమావేశ మందిరంలో ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సుపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయాల్లో పాటించాల్సిన నిబంధనలు, రిజిష్టర్ల నిర్వహణపై అవగాహన కల్పించారు. గోదాముల్లో విత్తనాలు, ఎరువులను ఒకేచోట ఉంచరాదన్నారు. పురుగు మందులు, కలుపు మందులను రైతులకు ఇచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఒకసారి వాడిన డబ్బాల్లో మందు మిగిలితే ఇంట్లో భద్రపరచాలని, పిల్లలకు అందుబాటులో ఉంచరాదన్నారు. వ్యవసాయ చట్టాలకు అనుగుణంగా మార్గదర్శకాలు పాటించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీలర్లకు సెమినార్ నిర్వహించారు. ఇన్‌పుట్ డీలర్లు తయారు చేసిన రిజిస్టర్లను ప్రదర్శించారు. వివిధ ప్రాంతాల ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.



రేణుకాయల్లమ్మవ్వకు మంగళహారతి ఇస్తున్న దృశ్యం,



అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి,



ప్రత్యేక పూజలందుకున్న శ్రీ దక్షిణామూర్తిస్వామి,



బైచిగేరిలో సాయిబాబాకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సాదాపురంలో సాయిబాబా ప్రతిమ ఊరేగింపులో కలశాలతో చిన్నారులు, మహిళలు

- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- షిర్డీ సాయిబాబాకు ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు

ఘనంగా గురుపౌర్ణమి



కుంబళనూరు క్యాంపులో పూజల్లో పాల్గొన్న భక్తులు







ప్రత్యేక పూల అలంకరణలో అర్థగేరి సాయిబాబా, కోసిగిలో ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న షిర్డీ సాయిబాబా సాదాపురంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు



కోసిగిలో భక్తులకు అన్నదానం చేస్తున్న భక్తులు

ఆదోని అర్బన్: పట్టణంలో గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం సాయిబాబా, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. ఈ మేరకు స్థానిక అర్థగేరి సాయిబాబా ఆలయంలో అలయ నిర్వాహకులు ద్వారకానాథ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో బాబాకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూల అలంకరణ, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకోత్సవం జరిగింది. అదేవిధంగా టీజీఎల్ కాలనీలో వెలిసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో శ్రీ సాయిసేవా సమితి ఆధ్వర్యంలో బాబాకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

- పట్టణశివారు ఎల్లమ్మకొండలో వెలిసిన శ్రీ రేణుకా ఎల్లమ్మవ్వకు ఆలయ నిర్వాహకుడు మోహన్‌ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పిండి వంటలు తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు.
- తిరుమలనగర్‌లో శ్రీ శారదాశంకర మఠంలో ఆలయ నిర్వాహకుడు డాక్టర్ కృష్ణదేవరాయశర్మ ఆధ్వర్యంలో అర్చకుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మ దక్షిణామూర్తి స్వామికి, జగద్గురు ఆదిశంకరాచార్యులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదోని రూరల్: మండలంలోని బైచిగేరి గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ సద్గురు సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. మండలంలోని సాదాపురంలో వెలిసిన సాయిబాబా ఆలయంలో ఉదయం 4 గంటల నుంచి సాయిబాబాకు మహాగణపతి పూజ, గురు భగవాన్ వ్యాసర మహర్షి పూజ, నవగ్రహ శాంతి పూజ, అఖండ గీతాహోమం, శ్రీ వ్యాసమహర్షి పటము ఊరేగింపు, గురు ప్రసాద వితరణ గావించారు. సద్గురు శ్రీ అచ్యుతానంద స్వాములవారికి గురు పూజా కార్యక్రమం, గురు అఖండ భజన కార్యక్రమం, అచ్యుతానంద స్వాములవారి ఉపన్యాసం నిర్వహించారు. అదేవిధంగా ఆలయంలో హోమం కార్యక్రమం చేపట్టగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు కలశాలతో చిన్నారులు, మహిళలు గ్రామ పురవీధులగుండా సాయిబాబా ప్రతిమను ఊరేగించారు.

సాయిబాబాకు పూజలు

కౌతాళం : మండల పరిధిలోని కుంబళనూరు క్యాంపు, ఏరిగేరి, కామవరం గ్రామాలతో పాటు రాజానగర్ క్యాంపులోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. ముందుగా ఆయా గ్రామాల్లోని బాబా విగ్రహాలకు తెల్లవారుజామునే భక్తులు జలాభిషేకం చేసి ఫలపుష్పాలతో సుందరంగా ఆలంకరించి ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

కోసిగి: మండల కేంద్రంలోని ఉరకుంద క్రాస్ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆదివారం వేకువ జామున నుంచి సాయి రుత్విక్ గట్టు రమేష్, సాయి సేవక్ పాండురంగ నేతృత్వంలో బాబా వారికి కాకడ హారతి, సుప్రభాత సేవ కార్యక్రమంతో పూజలు ప్రారంభించారు. సాయి సామూహిక సత్యవ్రతాలు, విరాట్ సాయి స్తోత్రము పఠనం, నిత్య ప్రార్థన గావించారు. మధ్యాహ్నం 12గంటలకు మధ్యాహ్న హారతి భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం సాయిబాబా వారి చిత్ర పటాన్ని పురవీధుల గుండా ఊరేగించారు. పూజ్యగురుదేవులు అమ్ముల సాంబశివరావు గారిచే రచించిన సాయిబాబా వారి జీవిత నుంచి 14వ భాగం భక్తులకు చదివి వినిపించారు. సాయంత్రం సంధ్య హారతి, రాత్రి శేజ్ హారతి, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. పూజలకు వచ్చిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

గోనెగండ్లలో గురుపౌర్ణమి వేడుకలు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల, వేముగోడు తదితర గ్రామాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. గోనెగండ్లలో వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి ఆధ్వర్యంలో పాత ఈశ్వర దేవాలయం నుంచి తుంగభద్ర కాలువ దగ్గర ఉన్న శివాలయం వరకు సాయిబాబా చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు. భక్తులు సాయి భక్తి చరణాలను పాడుకుంటూ ఊరేగించారు.

భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి



ఎమ్మిగనూరులో సాయిబాబా రథోత్సవం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సాయినాథుడి ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక వెంకట సాయి, దత్త సాయి, వీవర్స్ కాలనీ ఆలయంతో పాటు పట్టణంలోని సాయిబాబా ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద ఎత్తున పూజాకార్యక్రమాలు చేపట్టారు. వెంకటసాయి ఆలయంలో పెద్ద శేషవాహన సేవతో పాటు షిరిడీ సాయిబాబా రథోత్సవాన్ని నిర్వహించారు.



గోనెగండ్లలో సాయి పల్లకీని ఊరేగిస్తున్న వీరశైవమఠం పీఠాధిపతి శివయ్య స్వామి

కరాటేలో అక్కాతమ్ముడి ప్రతిభ



కరాటే పోటీలలో బంగారు పతకాలు సాధించిన షేక్ సాధియా, షేక్ ఉమార్ సైహాన్

గోనెగండ్ల : పెద్దనేలటూర్ గ్రామానికి చెందిన అక్కాతమ్ముళ్లు షేక్ సాదియా, షేక్ ఉమార్ సైహన్‌లు తెలంగాణ 12వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ప్రతిభను కనపరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు తల్లిదండ్రులు డి.మహమ్మద్, యాసీన్ బీ తెలిపారు. గోనెగండ్ల మండలం పెద్ద నేలటూర్ గ్రామానికి చెందిన డి.మహమ్మద్, ఎస్.యాసీన్‌బీ కొంత కాలంగా తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లాలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరికి కూతురు షేక్ సాదియా, కుమారుడు షేక్ ఉమార్ సైహన్‌లు ఉన్నారు. గద్వాలలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో సాధియా 8వ తరగతి, ఉమార్ సైహన్ 6వ తరగతి చదువుతున్నారు. వీరికి కరాటే అంటే చాలా ఇష్టం. దీనిని గుర్తించిన తల్లిదండ్రులు ప్రత్యేక శిక్షణలో చేర్పించారు. ఈనెల 19, 20, 21 తేదీలలో తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 38వ, 12వ రాష్ట్ర సబ్ జూనియర్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. అందులో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ఉమార్ సైహన్, సాదియాలు ప్రతిభను కనబరిచి బంగాలు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే పుంసే పోటీలలో కూడా వీరు తమ ప్రతిభను కనపరిచి రాష్ట్ర స్థాయిలో వెండి పతకాలను సాధించారు. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తల్లిదండ్రులు తెలిపారు. విషయం తెలుసుకున్న పెద్దనేలటూర్ గ్రామంలోని సమీప బంధువులు సంబరాలు జరుపుకున్నారు. జాతీయ స్థాయిలో ప్రతిభను కనపరిచి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఆదోనిలో పెట్టుబడులు పెట్టండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి

ఆదోని అర్బన్: ఆదోనిలో అన్ని రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని పెట్టుబడిదారులను, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వ్యాపారులను ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి కోరారు. ఆదివారం ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డులో శ్రీ వినాయక గ్రానైట్స్‌ను ఎమ్మెల్యే రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆదోనిలో వ్యాపారులు పెట్టుబడి పెట్టడం కారణంగా స్థానికంగా ఉన్న నిరుద్యోగులు, రోజూ పని చేసుకునే కూలీలకు ఉపాధి దొరుకుతుందన్నారు. తద్వారా పేద నిరుపేద కుటుంబాలకు న్యాయం జరగడమేగాకుండా, ఆదోని అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. వ్యాపారంలో పెట్టుబడులు పెట్టాలనుకున్న పెట్టుబడిదారులు ఎక్కడున్నా ఆదోనికి వచ్చి వ్యాపారాలు చేసుకోవాలని కోరారు.

వైభవంగా పాండురంగస్వామి రథోత్సవం





పురవీధుల్లో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు, (ఇన్‌సెట్)ప్రత్యేక అలంకరణలో రుక్మిణీపాండురంగస్వామి

ఆదోని అర్బన్: ఆషాఢమాసం తొలి ఏకాదశి వేడుకల్లో భాగంగా విక్టోరియాపేటలో వెలిసిన శ్రీ రుక్మిణీపాండురంగస్వామివారి రథోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ పాండురంస్వామి వెండి ఉత్సవ మూర్తులను రథంలో కొలువుంచి పురవీధుల్లో రథోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు, యువత, మహిళలు, కమిటీ సభ్యులు, పెద్దలు పెద్ద ఎత్తున రథోత్సవంలో పాల్గొన్నారు. హరినామస్మరణతో ఆలయం చుట్టూ పురవీధుల్లో రథోత్సవం కొనసాగింది.

ఆంధ్ర సరిహద్దుకు చేరిన దిగువ కాలువ నీరు



గంగమ్మకు పూజలు చేస్తున్న అధికారులు

హాలహర్వి: కర్నూలు జిల్లాకు తాగునీటి అవసరాల కోసం తుంగభద్ర జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీటిని ఈనెల 14వ తేదీన బోర్డు అధికారులు విడుదల చేశారు. దీంతో ఆంధ్ర సరిహద్దు అయిన మండలంలోని చింతకుంట వద్దకు ఆదివారం ఉదయం నీరు చేరుకున్నాయి. దీంతో కాలువ ఆఫీసర్లు, ఎస్‌డీఓ హసన్‌బాషా, జేఈలు దుర్గావరప్రసాద్, శ్రీకాంత్, మహేశ్వర్‌రెడ్డి, కాలువ సిబ్బంది, కాల్వ సెక్యూరిటీ గార్డులు, స్థానికులు దిగువ కాలువల వద్దకు చేరుకుని గంగమ్మకు పూజలు చేశారు. కాలువకు నీరు రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

దేవరగట్టులో పూజలు



హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం స్వామివారాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ పూజారులు మూల విరాట్‌కు జలాభిషేకం, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, రుద్రాభిషేకం, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ ఇతర ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామిని దర్శించుకోవడానికి వచ్చిన వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కక్షతోనే దాడికి పాల్పడ్డారు



ముతవల్లి ముల్లా ఖాసీం సాహెబ్ కుటుంబ సభ్యులు

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామానికి చెందిన నజీర్ అహ్మద్, ఖాజా బందేనవాజ్‌లు కక్ష సాధింపుతోనే తమపై దాడులకు పాల్పడ్డారని బాధితులు ముతవల్లి ముల్లా ఖాసీం సాహెబ్, కుమారులు రహిమత్ వలి, జిలానీ, ఖాజా, అబ్దుల్ ఆరోపించారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో జామీయా మసీద్ ముతవల్లిగా ముల్లా ఖాసీం సాహెబ్‌ను నియ మిస్తూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కమిటీ 01-11-2022వ తేదీన 1048 గెజిట్ నెంబర్‌ను విడుదల చేసిందన్నారు. ఆనాటి నుంచి ముతవల్లిగా మసీద్ బాగోగులు చూసుకుంటూ వక్ఫ్‌బోర్డు భూములను కాపాడుకుంటూ వస్తున్నామన్నారు. ఇటీవల గ్రామానికి చెందిన నజీర్‌అహ్మద్, ఖాజా బందేనవాజ్, పింజారి మహమ్మద్, పంజారి ఖాదర్ బాషాలు వక్ఫ్ బోర్డు భూముల కోసం ముతవల్లి విధులకు ఆటంకం కలిగిస్తూ కొద్ది రోజులుగా నిరంతరం గొడవలు పడుతూ వస్తున్నారు. అదేతరుణంలో ఈనెల 19వ తేదీన శుక్రవారం మధ్యాహ్నం సమయంలో జామీయా మసీద్‌లో నమాజు చేస్తున్న సమయంలో ముతవల్లిగా విధులు నిర్వహిస్తుండగా అడ్డుకుని దాడులు చేసి గాయపరిచారన్నారు. తాము ఏపార్టీకి చెందిన వారు కాదని, ముతవల్లిగా విధులు నిర్వహిస్తు జీవనం సాగిస్తున్నామన్నారు. విధులకు ఆటంకం కల్గిస్తున్న వారి పై విచారించి చర్యలు తీసుకోవాలని బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నిలిచిన పనులు.. ఇబ్బందుల్లో వ్యాపారులు

- ఎన్నికల కోడ్‌తో నిలిచిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు
- ఇసుక కొరత కారణంగా పునఃప్రారంభంకాని వైనం
- అప్పులు చేసి డిపాజిట్లు చెల్లించిన వ్యాపారులు
- వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నామంటూ ఆవేదన



నిలిచిపోయిన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు

ఆదోని టౌన్: ఆదోని పట్టణం నడిబొడ్డున పాత బస్టాండ్ సర్కిల్‌లో నిర్మితమవుతున్న మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు సార్వత్రిక ఎన్నికల కోడ్ సందర్భంగా ఆగిపోయాయి. కోడ్ ముగిసి, కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటికీ ఇసుక కొరత కారణంగా కాంట్రాక్టర్ పనులు పునః ప్రారంభించలేదు. దీంతో గుడ్‌విల్ చెల్లించి షాపులను వేలం పాటలో దక్కించుకున్న వ్యాపారులు పనులు ఎప్పుడు పూర్తవుతాయో, వ్యాపారాలు ఎప్పుడు ప్రారంభించుకోవాలోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి డిపాజిట్లు చెల్లించామని, నెలనెలా వాటికి వడ్డీలు చెల్లిస్తున్నామని వాపోతున్నారు.

పునాదుల వరకు పనులు..

మొదటి విడతగా ఫస్ట్ ఫ్లోర్‌లో 77 షాపుల నిర్మాణం పనులను చేపట్టారు. 2024 ఫిబ్రవరిలో అప్పటి ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. పనులు ప్రారంభమై పునాది లెవెల్ పనులు పూర్తి అయ్యాయి. పనులు వేగం పుంజుకుంటున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులను పునఃప్రారంభించడంలో సంబంధిత ఇంజినీరింగ్ సెక్షన్ అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

353 షాపుల నిర్మాణానికి ప్రణాళిక

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్‌లో 353 షాపులు నిర్మించేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నాలుగు అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. మొదటి అంతస్తులో 75 షాపులు, రెండో అంతస్తులో 120 షాపులు, మూడో అంతస్తుల్లో 22 షాపుల నిర్మాణం చేపట్టనున్నారు. మొదటి విడతగా కాంప్లెక్స్‌లో ఫస్ట్ ఫ్లోర్ కింద 77 షాపుల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన ఎస్టిమేట్లు వేసి, రూ.35 కోట్లకు బహిరంగ టెండర్లు వేశారు. ఇందులో 45 మంది షాపుల యజమానుల నుంచి గుడ్ విల్ పేరుతో అడ్వాన్స్‌గా రూ.11 కోట్లు వసూలు చేశారు.

ఇసుక కొరత, బిల్లుల చెల్లింపులో జాప్యం

కోడ్ ముగిశాక కొత్త ప్రభుత్వ హయాంలో ఇసుక కొరత, బిల్లులు సకాలంలో అందడంలేదనే సాకుతో కాంట్రాక్టర్ పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. అయితే నిబంధనల మేరకు పనులు పూర్తి చేస్తేనే బిల్లులు చెల్లిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా అప్పులు చేసి డిపాజిట్లు చెల్లించిన వ్యాపారులు పనులు ఆలస్యం కావడంతో నష్టపోతున్నామని, అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వాపోతున్నారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులను త్వరితగతిన పూర్తి చేసి తమకు న్యాయం చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

అడ్వాన్స్ కింద రూ.7 లక్షలు చెల్లించాం



కాంప్లెక్స్‌లో షాపు కోసం టెండర్లు వేశాం. అడ్వాన్స్ కింద రూ.7 లక్షలు చెల్లించాం. పనులను త్వరితగతిన పూర్తి చేయాలి. అప్పులు చేసి డిపాజిట్లు కట్టాం. అధికారులు ఆలస్యం చేయడం వల్ల తెచ్చిన అప్పుకు వడ్డీలు కట్టలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిర్మాణం పనులు వేగవంతం చేయాలి. – బాషా, వ్యాపారి, ఆదోని

త్వరలోనే పనులను ప్రారంభిస్తాం



మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు ఆగిపోలేదు. ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం. ఇసుక కొరత కూడా ఉంది. సమకూర్చుకోవాలని కాంట్రాక్టర్‌లకు సూచించాం. నిబంధనల మేరకే బిల్లులు చెల్లిస్తాం. మొదటి విడత బిల్లులను చెల్లించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. త్వరలోనే ఎస్ఈ నిర్మాణం పనులను పరిశీలించనున్నారు. ఆ తర్వాత పనులు ప్రారంభిస్తాం. – చలపతిరావు, ఎంఈఈ